25న మెగా సమ్మర్ జాబ్ మేళా

విశాలాంధ్ర-రాజాం: రాజాం జీఎంఆర్ ఐటి కళాశాలలో జీఎంఆర్ రక్ష సెక్యూరిటీ సర్వీసెస్ వారి జాబ్ మేళా నిర్వహించ నున్నారు. ప్లేస్ బ్లాక్ నెంబర్-4 సెమి నార్ హాల్ ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని రక్ష రిక్రూట్మెంట్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలియజేసారు. ఈ జాబ్ మేళాలో సుమారు 100 పోస్టులకు పైగా ఉద్యోగాలు ఉన్నాయన్నారు. కావున యువత ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని ఈ సందర్భంగా కోరారు. వర్కు ఎక్సిపీరెన్సు ఉన్న సెక్యూరిటీ గార్డులకి ప్రయారిటీ ఇవ్వబడును. కావలసిన అర్హతలు. 10వ తరగతి పాస్, ఎత్తు 166 సెంటీమీటర్, వయస్సు 18 నుండి 35 సంవత్సరాలు లోపు వున్న పురుషులు సెక్యూరిటీ పోస్టులకు అర్హులన్నారు. వారు తమ సర్టిఫికేట్స్‌తోఇంటర్వ్యూకి హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరారు. వివరాలకుఈ నెంబర్‌లో 9573043507 సంప్రదించాలని కోరారు.

ఘనంగా బుద్ద పౌర్ణమి

విశాలాంధ్ర-బొబ్బిలి: గ్రీన్ బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో బుద్ధ పౌర్ణమి సందర్భంగా బొబ్బిలి మండలం కునుకు వాని వలస వద్ద రిటైర్డ్ టీచర్ చప్ప అప్పలనాయుడు గారు నిర్మించిన బుద్ధుని విగ్రహం వద్ద పూలమాలలు వేసి ఆయన బోధనలు సారాంశంను గుర్తుచేసారు. సమాజంలో శాంతి నెలకొల్పడం మే లక్ష్యంగా గౌతమబుద్ధుని ప్రబోధనలు ఉన్నాయని గ్రీన్ బెల్ట్ సొసైటీ సభ్యులు శర్మ,విజయ్ గౌరి, మల్లేశ్వరరావు, శ్రీనివాస్, రామ కృష్ణ, గంగాధర్, రామారావు లు పాల్గొన్నారు. ఈనాటి జ్ఞాపకార్థం విగ్రహం వద్ద మొక్కలు నాటారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులుగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అప్పలనాయుడు ని శాలువాతో సత్కరించారు. గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల వద్ద విస్తృత భద్రత ఏర్పాట్లు

సమీక్షా సమావేశంలో ఎస్పీ దీపిక

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తదుపరి జూన్ 4న ఎన్నికల కౌంటింగు కేంద్రాల వద్ద చేపట్టాల్సి భద్రత, బందోబస్తు ఏర్పాట్లను సమీక్షిం చేందుకుగాను జిల్లాలో పని చేస్తున్న పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ ఎం.దీపిక జిల్లా పోలీసు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎం.దీపిక మాట్లాడుతూ జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ముగిసిన తరువాత జూన్ 4న ఎన్నికల కౌంటింగు నిర్వహించే జె.ఎన్.టి.యు, లెండీ ఇంజనీరింగు కళాశాలల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విస్తృత బందోబస్తు, భద్రత ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. ఎన్నికల కౌటింగు కేంద్రాల వద్ద ఎటువంటి అల్లర్లు జరగకుండా పోలీసు అధికారులు, సిబ్బంది నిర్వహించాల్సిన విధులు, చేపట్టాల్సిన భద్రత చర్యల పట్ల అధికారులకు జిల్లా అవగాహన కల్పించి, దిశానిర్దేశం చేసారు. కౌటింగు కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల భద్రత, రూఫ్ టాప్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ రెగ్యులేషన్, వాహనాల పార్కింగుకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కౌంటింగు కేంద్రాల వద్ద ప్రజలు గుమిగూడకుండా చూడాలన్నారు. కౌంటింగు కేంద్రాలకు విచ్చేసే వివిధ పార్టీలకు చెందిన కౌంటింగు ఏజంట్లు వాహనాలను కౌటింగు కేంద్రాల వద్ద ప్రత్యేకంగా నిర్దేశించిన పార్కింగు ప్రాంతాలకు తరలించాలన్నారు. వాహనదారులు ఇబ్బందులు పడకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని, కాషనరీ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కౌటింగు కేంద్రాలలోకి వెళ్ళే కౌటింగు ఏజంట్లును క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, రిటర్నింగు అధికారి జారీ చేసిన అనుమతి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత మాత్రమే కౌటింగు కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. రిటర్నింగు అధికారులు, కౌటింగు సూపర్ వైజర్స్ మినహా మిగిలిన వారి మొబైల్స్ ను కౌటింగు కేంద్రాల్లోకి అనుమతించ వద్దన్నారు. కౌటింగు కేంద్రాల పరిసరాలను బాంబ్ డిస్పోజల్స్ బృందాలతో తనిఖీలు చేయాలని, మహిళలను తనిఖీ చేసేందుకు ప్రత్యేకంగా మహిళా పోలీసు సిబ్బందిని నియమించాలని జిల్లా ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఫలితాలు వెల్లడైన తరువాత ఎటువంటి అల్లర్లు చెలరేగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పెట్రోలింగు నిర్వహించాలని, ముందుగా గుర్తించిన ప్రాంతాల్లో నిఘా పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ట్రైనీ ఐపిఎస్ మండ జావలి అల్ఫాన్స్, విజయనగరం డిఎస్పీ ఆర్. గోవిందరావు, బొబ్బిలి డిఎస్పీ పి.శ్రీనివాసరావు, చీపురుపల్లి డిఎస్పీ ఎ.ఎస్. చక్రవర్తి, ట్రాఫిక్ డిఎస్పీడి.విశ్వనాథ్, డిటిసి డిఎస్పీ వీరకుమార్, ఎఆర్ డిఎస్పీ యూనివర్స్, ట్రైనీ డిఎస్పీ ఎస్.మహేంద్ర, సిఐలు కే.కే.వి. విజయనాథ్, జె. మురళి, బి.వెంకటరావు, కే.రామారావు, ఎం.శ్రీనివాసరావు, బి. వెంకటేశ్వరరావు, రవికుమార్, ఎం. నాగేశ్వరరావు, ఎస్.తిరుమలరావు, వి.వి.చంద్రశేఖర్, సత్యన్నారాయణ, బి. లలిత, బి.నాగేశ్వరరావు, మోహనరావు, ఎస్.శ్రీనివాస్, మురళి, హెచ్.ఉపేంద్రరావు, చంద్రశేఖర్, రాజశేఖరరావు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేపాడలో అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

- పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి
- ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామ ప్రజలు

విశాలాంధ్ర-వేపాడ: మండల కేంద్రం వేపాడ పంచాయతీలో డ్రైజేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది.గ్రామంలోని కాలువ ల్లోని పూడికను తీయకపోవడంతో కాలవల్లోని మురుగు నీరు రోడ్డు పైనుంచి పారుతుంది.ప్రభుత్వ మద్యం దుకాణం ఆవరణలో మురుగు కాలువ లేక మురుగునీరు రోడ్డుపై నుంచి పారుతుంది.మురుగునీరు రోడ్డుపై నుంచి పారడంతో పాటు దుర్గంధం వెదజల్లడంతో పాద చారులు,వాహనదారులు, చుట్టుపక్కల ప్రాంత ప్రజలు నాన్న ఇబ్బందులకు గురవడంతో పాటు రోగాల బారిన పడతామన్న భయాందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం ఆడపాదడపా వర్షాలు కురుస్తున్న ప్పటికీ రానున్నది వర్షాకాలం కావడంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రజలు రోగాల బారిన పడతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు కానీ,పంచాయతీ పాలకులు గానీ పట్టించుకోక పోవడం గమనార్హం.ఇప్పటికైనా అధికారులు పంచాయతీ పాలకలు కళ్ళు తెరిచి గ్రామంలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థను.సరిచేయాలని గ్రామస్తులు అంటున్నారు. లేకుంటే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

రోడ్లపై నుంచి పారుతున్న మురుగునీరు

బొబ్బిలిలో గంజాయి బ్యాచ్ హల్‌చల్...!

ఎగ్జిబిషన్ కు వచ్చిన కుటుంబంపై దాడి
సందర్శకుల భద్రతా ప్రమాణాలపై అధికారుల నిర్లక్ష్యం

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణం ఫ్లై-ఓవర్ డౌన్, ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ వద్ద నిన్న రాత్రి గంజాయి బాబులు హల్చల్ చేశారు. ఎగ్జిబిషన్ లో గంజాయి బాబులు అసభ్యంగా ప్రవర్తిస్తుండటంతో వారిని వారించిన కుటుంబంపై భౌతిక దాడికి పాల్పడ్డారు.. మహిళలు, చిన్నారులు అనే విచక్షణ లేకుండా అందరిపై దాడి చేసి గాయపరిచారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు గంజాయి బాబులను వారించకుండా ప్రేక్షకపాత్ర వహించడంతో, పోలీసులను బాధితులు ఆశ్రయించారు. పోలీసులు రంగప్రవేశం చేసేలోపు అక్కడ నుండి గంజాయి బ్యాచ్. సభ్యులు పరారయ్యారు. దిక్కుతోచని బాధిత మహిళలు, చిన్నారులు తమ కుటుంబంతో సహా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందారు. పోలీసులు బాధితుల వద్ద నుండి ఫిర్యాదు సేకరించారు. పట్టణంలో విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు దోరగా సాగుతున్నాయని పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు . తారకరామా కాలనీ, ఇందిరమ్మ కాలనీ, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే జంక్షన్, అమ్మి గారి కోనేరు గట్టు, తదితర ప్రాంతాల్లో గంజాయి విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నాయని దీంతో కొంతమంది విద్యార్థులు గంజాయి మత్తుకు అలవాటు పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు బ్యాచ్ నుండి బొబ్బిలి పట్టణ మరియు చుట్టుపక్కల గ్రామ ప్రజలకు పోలీసులు ఎలాంటి రక్షణ కల్పిస్తారో వేచి చూడాలి.

నేను పోతున్నా..మరోచోటైనా అవకాశమివ్వండి..!

కొన్ని తరాలుగా సేవలు అందించా.. నేడు కనుమరుగవుతున్నా..
నేను లేకపోతే మీకు ఇబ్బంది.. అందుకే కొత్త స్థలం చూడండి
ఇది జామి శ్మశాన వాటిక ఆత్మఘోష

(విశాలాంధ్ర-జామి)

అయ్యా..!

15వేలమంది జనాబా కలిగిన మండల కేంద్రం జామిని పరిపాలిస్తున్న, పెద్దలుగా పేరొందిన నేతలకు, పలువురు పెద్దలకు ఎంతో ఆవేదనతో, కన్నీళ్ళతో మీ జామికి సేవలందించిన శ్మశాన వాటిక విన్నవించుకుంటున్న అక్షరావేదన ఇది. ఎంతో మానసిక వేదనతో తెలియజేస్తున్న ఆత్మఘోష ఇది. దయచేసి మీరంతా ఎన్నో విషయాలు తెలిసిన జ్ఞానులు, ఎంతో తెలివైన వారు. నా ఆవేదనను కొద్దిసేపు మీ విలువైన సమయాన్ని కేటాయించి చదవుతారని చిన్న ఆశతో కొన ఊపిరితో ఉన్న మీ శ్మశానవాటిక కోరుకుంటోంది. ఇక విషయానికి వస్తే..

నేను జామిలో రికార్డువరంగా శ్మశాన వాటికగా లేకపోయినా నన్ను కొన్నితరాలుగా దహన సంస్కారాలకు వినియోగిస్తున్నారు. నేను కూడా నన్ను అభివృద్ధి చేయకపోయినా మీకు ఎటువంటి కల్మషం లేకుండా సేవలు అందించాను. ఎందుకంటే మీరంతా ఎప్పటికైనా నా దగ్గరకు వస్తారనే కారణంతోనే. కానీ ఇటీవల విశాఖ-రాయపూర్ కారిడార్ పేరుతో ఓ భూతం వచ్చి నన్ను పూర్తిగా తినేయాలని చూసింది. కానీ మీరంతా నాకు అండగా ఉన్నారనే నమ్మకంతో ధైర్యంగా ఉన్నాను. కానీ నా నమ్మకాన్ని మీరు వమ్ముచేసారు. కార్పొరేట్ గెద్దలు వచ్చి నన్ను తినేస్తున్నా మీరంతా చోద్యం చూస్తున్నారు. ఇంతలోనే నన్ను వదిలి వేరే స్థలంలో శ్మశానం అన్నారు. పోనీలే నా పిల్లలే కదా.. వారికి స్థలం దొరికితే చాలనుకున్నాను. కానీ కొత్త స్థలం ప్రయత్నాలు అటకెక్కాయని తెలిసి తీవ్ర మధన పడ్డాను. ఇప్పుడు కొనఊపిరితో ఉన్న నన్ను పూర్తిగా నామ రూపాల్లేకుండా చేసేందుకు కార్పొరేట్ శక్తులు ప్రహరీ గోడ నిర్మిస్తున్నారు. ఇది పూర్తి అయితే నేను మీకు పూర్తిగా దూరం అవుతాను. ఎంతో ఆధారంగా ఉన్న నేనుపోతే మీకు ప్రత్యామ్నాయం ఏదీ..? ఈ విషయం మీరు ఎందుకు ఆలోచించడంలేదో..! నాకు ఇప్పటికీ అంతుచిక్కడం లేదు. ఏది ఏమైనా మీరంతా మంచి శ్మశానాన్ని ఏర్పాటు చేసుకోవాలని, నాలాగా కాకుండా చుట్టుపక్కల ఉన్న గ్రామాలలో శ్మశానాల మాదిరిగా ఎంతో అందంగా తయారు చేసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ..

మీకు ఇంతకాలం సేవలందించిన (అధికారికంగా లేని)
మీ జామి శ్మశానవాటిక.. బై..బై.

ప్రయాణికుడికి సెల్‌ఫోన్ అందజేసిన ఆర్టీసీ అధికారులు

విశాలాంధ్ర-విశాలాంధ్ర రూరల్ : స్థానిక విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రామకృష్ణ రాజు అనే పాసింజర్ విజయనగరం నుంచి చీపురుపల్లి ప్రయాణం చేశారు , ఈ ప్రయాణంలో తమ వద్ద ఉన్న 15,000 విలువచేసే మొబైల్ ఫోన్ బస్సులోని మరిచిపోయి బస్సు దిగిపోయారు, ఆ మొబైల్ ఫోన్ బస్సులో కండక్టర్ గుర్తించి సదరు డిపో డిపో అధికారులకు మొబైల్ ఫోన్ అందజేశారు, సదరు మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న పాసింజర్ వచ్చి అడగగా అతని యొక్క వివరాలు తెలుసుకుని బాధితుడికి మొబైల్ ఫోన్ ఇవ్వడం జరిగింది. ఎంతో విలువైన మొబైల్ ఫోన్ తిరిగి ఇవ్వడంతో ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టిఐ రామారావు ఆర్టీసీ హెడ్ కానిస్టేబుల్ సత్యం, ముత్యాలు పాల్గొన్నారు.

మిస్ ఫ్రీ టీన్‌గా ప్రీతి పట్నాయక్

విశాలాంధ్ర-గజపతినగరం: మిస్ ఫ్రీ టీన్ ఇండియా 2024 విజేతగా గజపతినగరానికి చెందిన గర్భం లక్ష్మీపతి పట్నాయక్ జగదాంబ మనుమరాలు ప్రీతి పట్నాయక్ టైటిల్‌ని గెలుచుకున్నారు ఇటీవల కేరళలో జరిగిన జాతీయస్థాయి అతిపెద్ద అందాలపోటీలలో ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహించి అద్భు తమైన ప్రదర్శనతో గెలుపొందారు. అవార్డు రావడం పట్ల తల్లిదండ్రులు ప్రసాద్ పట్నాయక్ అనిత పట్నాయక్, కుటుంబ సభ్యులు స్నేహితులు గురువారం హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు పరమాదంలో వ్యక్తి దుర్మరణం

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని కుమ్మపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గోలగాని అప్పన్న(50) అక్కడికక్కడే మృతిచెందాడు. వల్లంపూడి ఎస్ఐ కే.రాజేష్ అందించిన వివరాలు ప్రకారం బుధవారం సాయంత్రం 6 గంటల సమయంలో కొత్తవలస ఆనందపురం ఆర్ అండ్ బి రహదారికి ఆనుకొని కుమ్మపల్లి సెంటర్లో గల కోళ్ల ఫారం సమీపంలో కొత్తవలస నుండి వస్తున్న టాటా మ్యాక్సీ ఆటో గొలగాని అప్పన్నను వెనుక నుండి వచ్చి ఢీ కొనడంతో అతడు రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతిచెందాడని అలాగే ఈయన లక్కవరపుకోట మండలం పిల్ల అగ్రహారం గ్రామానికి చెందిన ఈయన కుమ్మపల్లిలో కోళ్ల ఫారంలో పనిచేస్తున్నాడని ఈయన కాలకృత్యాలు నిమిత్తం రోడ్డు పక్కకు రావడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. అలాగే ప్రమాదానికి కారణమైన ముద్దాయిని అదుపులోకి తీసుకొని టాటా మ్యాక్సీ ని స్టేషన్ కి తరలించి కేసు నమోదు చేయడం జరిగిందని అలాగే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట సిహెచ్ కి తరలించడం జరిగిందని ఎస్ఐ కే. రాజేష్ తెలిపారు.

శ్రీబంగారమ్మతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్.కోట మండలంలోని గౌరీపురం, లచ్చన్నదొరపాలెం గ్రామాల్లో శ్రీ బంగారమ్మతల్లి తీర్థ మహోత్సవ కార్యక్రమంలో శృంగవరపుకోట నియోజకవర్గ ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారి గురువారం పాల్గొన్నారు. శ్రీబంగారమ్మ అమ్మవారిని లలితకుమారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పసుపు కుంకుమ సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి లలితకుమారి వెంట ఎస్.కోట మండల పార్టీ అధ్యక్షులు జిఎస్ నాయుడు, నాయకులు ఇందుకూరి శ్రీనివాసరాజు, సత్తిబాబు రాజు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఉన్నారు.

మూర్తికి గౌరవ డాక్టరేట్

విశాలాంధ్ర-బొబ్బిలి: మండలం జగన్నాథపురం గ్రామం చెందిన ప్రముఖ కవి రచయిత విశ్లేషకులు విమర్శకులు కళా రత్న సేవారత్న తెలుగు వెలుగు సాహిత్య జాతీయ వేదిక అధ్యక్షులు పిఆర్ఎస్ ఎస్ ఎన్ మూర్తికి గురువారం విశాఖపట్నం లో గౌరవ డాక్టర్ తో సత్కరించి సాలువాతో సత్కరించి మేమంటూ అందజేశారు గాడ్ సన్ హోలీ స్పిరిట్ టెక్నాలజీ అకాడమీ ఆధ్వర్యంలో ఆర్చ్ బిషపో చైర్మన్ అండ్ డైరెక్టర్ డాక్టర్ ఎం వి ప్రసాద్ వైస్ ప్రెసిడెంట్ డా. కె మరియా కుమార్ డా ఏసుదాసు డా బిఎస్‌రావు తెలిపారు డాక్టర్ మూర్తి మాట్లాడుతూ ఈ గౌరవడాక్టరేట్ రావడం చాలా ఆనందదాయకంగా ఉందని తెలిపారు కిలపర్తి దాలినాయుడు మాస్టారు మీసాల చిన్న గౌరీ నాయుడు డా మోటూరి నారాయణరావు డాక్టర్ బి రమాదేవి డాక్టర్ నవనీత రవీందర్ డాక్టర్ బేత శారదా దేవి డాక్టర్ బాలచంద్ర సాదీ. డా చొప్పదండి రాధ. డాక్టర్ రామకృష్ణ డాక్టర్ గౌరవరాజు సతీష్‌కుమార్ యామిని కొల్లూరు ముత్తుకూరు రంగారావు తదితరులు అభినందించారు.

నేటి నుంచి ఐదోతరగతి ప్రవేశాలు ప్రారంభం

విశాలాంధ్ర-నెల్లిమర్ల: నెల్లిమర్ల మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో శుక్రవారం నుంచి ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఆ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రమామోహిని తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలో 80 సీట్లు అందు బాటులో ఉన్నాయని చెప్పారు. ప్రవేశాల కోసం ఇప్పటికే రాత పరీక్ష నిర్వహించామన్నారు. రాత పరీక్షలో అర్హత పొందిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఇప్పటికే ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. సమాచారం అందుకున్న విద్యార్థులు ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు ప్రవేశాలు ఖరారుచేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. ప్రతిరోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రవేశాల ప్రక్రియ కొనసాగు తుందని పేర్కొన్నారు. సూచించిన ధ్రువపత్రాలతో హాజరు కావాలని చెప్పారు.

వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న కూటమి నాయకులు

విశాలాంధ్ర-నెల్లిమర్ల: నెల్లిమర్ల నియోజకవర్గ కూటమి నాయకులు గురువారం తిరుపతి వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్నవారిలో నెల్లిమర్ల నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి కర్రోతు బంగార్రాజు, నెల్లిమర్ల మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, జనసేన నాయకులు నాని ఉన్నారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో పాటు, నెల్లిమర్ల నుంచి లోకం నాగ మాధవి గెలుపొందాలని వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నట్లు చెప్పారు.

జల వనరులను సంరక్షిద్దాం

విశాలాంధ్ర-భోగాపురం: జలం లేని చోట జీవమే లేదు. ప్రతీ చుక్కని ఒడిసిపట్టి సంరక్షించుకోకపోతే భవిషత్ అంతా ఎడారే. సమస్త జీవులకు ఆధారమైన జలాలు నేడు అడుగంటి పోతున్నాయి. ఇప్పటికి గ్రామాలలో త్రాగు నీటి కొరత వేధిస్తుంది. బోర్లు ద్వారా అవసరానికి మించి నీటిని తోడి వృధా చేసున్నారు. దీని వలన భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. జలరాశిని ఒడిసి పట్టుకునేందుకు ప్రతీ ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాలు చెప్పినా ప్రజల చెవికెక్కలేదు. అభివృద్ధి పేరిట పచ్చని వనాలను నరికేస్తున్నారు. దీని వలన చాల ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. నీటి వనరులు తగ్గిపోతే జీవ వైవిధ్యం కూడా దెబ్బతింటుంది. కేంద్ర ప్రభుత్వం జల రాశిని సంరక్షించేందుకు జల్, జంగల్, జమీన్ అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తోంది. జల సంరక్షణ లో భాగంగా ప్రతీ ఇంటిలో తప్పకుండ ఇంకుడు గుంతలను నిర్మించాలని కోరుతుంది.వర్ష పాతం పెంచేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటి వనాలను పెంచేందుకు సహకరించాలని కోరుతుంది. ఈ జల యజ్ఞం లో అంకిత భావంతో చేతులు కలిపి జల, వన సంరక్షణ, కోసం చెట్లను నాటి వనాలను పెంచి నీటి వనరులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉంది.

జాబ్‌కార్డుకు అకౌంట్ లింక్ అవ్వక వేతనదారుల అవస్థలు

విశాలాంధ్ర-తెర్లాం: ఉపాధి వేతన దారులు తమ బ్యాంకు ఖాతాలో వేసిన డబ్బులను తీసుకొనే వీలులేక అనేక ఇబ్బందులు పడుతున్నామని ఉపాధి కార్మికులు వాపోతున్నారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ తమ బ్యాంక్ కాతాల్లో వేసిన డబ్బులు పడకపోవడంతో ఉద్దవోలు నుండి తెర్లాం మండల కేంద్రంలోవున్న ఉపాధి హామీ కార్యాలయానికి ఉద్దవోలు గ్రామం నుంచి రోజూ వెళ్తున్నప్పటికి డబ్బులు పడలేదని, అక్కడి సిబ్బంది సాంకేతిక సమస్యలున్నాయని చెబుతున్నారని, దీంతో ఖాతాలో ఉన్న డబ్బులు తీసుకోలేక అనేక ఇబ్బందులు పడుతున్నామని వేతనదారులు వాపోతున్నారు. మీ జాబ్ కార్డు కు అకౌంట్ లింక్ అవ్వటంలేదని చెబుతున్నారని ఉద్దవోలు ప్రజలు వాపోతున్నారు. తమ గ్రామాల నుంచి తెర్లాం రావాలంటే 15 కిలోమీటర్లు రావలసి వస్తుందని ఉపాధి హామీ కంప్యూటర్ ఆపరేటర్ ముందు వేతనదారులు గంటల నిలబడి జాబ్‌కార్డు లు, ఆధార్ కార్డులు పట్టుకుని కంప్యూటర్ ఆపరేటర్ ముందు నిలు చుంటున్నామని అన్నారు. వచ్చిన వేతనాదారులను మీకు జాబ్‌కార్డు అకౌంట్ లింక్ అవ్వటంలేదని, బ్యాంక్ వద్ద అకౌంట్ ఆధార్‌తో లింక్ చేయపోవడం వల్ల ఈ సమస్యలు వస్తున్నాయి అని, పోస్ట్ ఆఫీస్ అకౌంట్ లు ఓపెన్ చేయనుకోండని అప్పుడు ఏ ఇబ్బంది లేకుండా మీ అకౌంట్ నుండి డబ్బులు సులభంగా తీసుకోవచ్చని చెబుతున్నారు. తాము ఇంతకన్నా ఏమి చెయ్యలేమని సిబ్బంది చెబుతున్నారని అన్నారు.

సర్వం "సర్వే" స్వరం

సర్వేలకే పార్టీల ప్రాధాన్యం

విశాలాంధ్ర-విజయనగరం: రాజకీయాలు మారాయి..అధినాయకత్వమే నియోజకవర్గ నేతలతో నేరుగా మాట్లాడుతున్న పరిస్థితి. జిల్లా నాయకత్వం పాత్ర పరిమితమైపోయింది.అనుయాయులు చుట్టూ ఉన్నా అందులో ఏ ఒక్కరికైనా ఎన్నికల సమయంలో టికెట్టో, అధికారంలోకి వచ్చాక నామినేటెడ్ పోస్టో ఇప్పిస్తామని గట్టిగా హామీ ఇవ్వలేనిపరిస్థితుల్లో జిల్లాల్లో నాయకత్వం ఉందనడం అతి శయోక్తికాదు.ఒకప్పటి పరిస్థితి వేరు.జిల్లా స్థాయి నాయకుల మాట అధిష్టానం దగ్గర చెల్లుబాటయ్యేది.ఇప్పుడు జిల్లా పెద్దలుగా పేరొందిన వారు కూడా తమరాజకీయ భవిష్యత్ పైనే గ్యారంటీ ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. రాజకీయాల ట్రెండ్, అధిష్టానం ఆలోచనాధోరణి మారడమే ఇందుకు కారణం. పార్టీ బాధ్యులకంటే, సర్వేల నివేదికలకే అధిష్టానాలు ప్రాధాన్య మిస్తున్నాయని వర్తమాన పరిస్థితులు చాటుతున్నాయి. ఈ ఎన్నికలనే పరిశీలిస్తే టికెట్ గ్యారంటీ అనుకున్నవారిలో చాలామందికి ఆయా పార్టీల అధిష్టానాలు జలక్ ఇచ్చాయి. మీకిక్కడకంటే పక్క నియోజక వర్గం బాగుంటుందని అధిష్టానాలు నిర్ణయాలు ప్రకటించిన ఉదాహరణలు రాష్ట్రంలో నెలకొంది.అప్పటి వరకు నియోజక వర్గాన్ని నమ్ముకున్న ఆయానేతలు అధిష్టానం నిర్ణయంతో తెల్లబోయారు. పార్టీ చేపట్టిన సర్వేలే ఇందుకు కారణమని తెలుసుకుని సదరు సర్వే నిర్వాహకులపై గంగవెర్రులెత్తిన వారూ ఉన్నారనే టాక్ విన్పించింది. పోనీ ఏదో ఒక సర్వేతోనే కథ సుఖాంతభవుతుందంటే ఆ పరిస్థితీ లేదు.ఆఖరి నిముషం వరకు ఐవి ఆర్ ఎస్ సర్వే గొంతు చెవుల్లో మోగుతూనే ఉంది.అసలు అందులో తమ పేరు లేదని గగ్గోలు పెట్టిన వారూ ఉన్నారు. ఇన్ని హర్డిల్స్ దాటి ఎన్నికల బరిలోకి దిగాక ప్రజామోదం ఉంటుందో లేదో అనే టెన్షన్. సరే విజయం సాధించి అసెంబ్లీలో అడుగు పెట్టే అదృష్టం లభిస్తే..మంత్రి వర్గంలో అవకాశం దక్కుతుందేమో అనే ఆశ. మంత్రి అనిపించుకున్నాక ఆ పదవీ ఐదేళ్ల పాటూ వుంటే మరీ అదృష్టమనే తీరుకి పరిస్థితులొచ్చాయి.అధిష్టానం మొదలుకొని క్షేత్ర స్థాయి వరకు పార్టీ పదవుల్లో అనేక మంది నాయకులు ఉన్నప్పటికీ , నియోజక వర్గ నాయకులు తమ సమస్యలను నేరుగా అధిష్టానానికే చెపుతున్న పోకడ ప్రస్తుతం కన్పిస్తోంది. జిల్లాస్థాయిలో వర్గపోరు వంటి సమస్యలను పరిష్కరించుకునే అవకాశాలున్నా నేరుగా రాష్ట్ర నాయకత్వానికే ఒకరిపై మరొకరు ఫిర్యాదు లు చేసుకుంటున్నారు. వర్తమాన రాజకీయాల్లో పార్టీ అంతర్గత వ్యవస్థ పనిచేస్తున్నట్లే ఉంటుంది..కానీ అధిష్టానమే సర్వం కనిపెడుతూ పరిస్థితులు చక్కదిద్దుతోంది. సర్వేలు, ఐవి ఆర్ ఎస్ లతో అభిప్రాయాలను సేకరిస్తూ పార్టీకి ఉపకరిస్తుందనిపించే నిర్ణయాలను అధిష్టానం అమలు పరుస్తోంది.ప్రాంతీయ పార్టీలలో అధినాయకునిదే అంతిమ నిర్ణయమనే సత్యానికి వర్తమాన రాజకీయాలు అద్దం పడుతున్నాయి.ఆ నిర్ణయాలు సర్వే నివేదికలతో ప్రభావితం కావడమే విశేషం.

సహకారం ఒక జీవన విధానం

వీసీబీ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు

విశాలాంధ్ర-రాజాం: సహకారమే ఒక జీవన విధానమని నమ్మకంతో పనిచేస్తున్న బ్యాంక్ ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్(వీసీబీ) అని ఆ బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. గురువారం స్థానిక శ్రీ సూర్యదుర్గ కళ్యాణ మండపంలో ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ రాజాం బ్రాంచి సభ్యుల మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి బ్యాంకు డైరెక్టర్ కందాపు ప్రసాదరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ రాఘవేంద్రరావు మాట్లాడుతూ సహకార రంగంలో పేద మధ్యతరగతి, చిరు వ్యాపారులకు తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేస్తూ డిపాజిట్‌దారులకు ఎక్కువ శాతం వడ్డీ అందిస్తూ సహకార స్ఫూర్తికి న్యాయం చేస్తున్న విశాఖ కోఆపరేటివ్ బ్యాంకు (వీసీబీ)ను మరింత అభివృద్ధిపథంలో నడిపించడానికి బ్యాంకు సభ్యులు సహాయ సహకారాలందించాలని ఆయన కోరారు. బ్యాంకుకు రావాల్సిన బకాయిలను పైసాతో సహా వసూలుచేస్తామని తెలిపారు. 14 బ్రాంచ్ లకు సొంతభవనాలు ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. విశాఖపట్నం గోపాలపట్నం బ్రాంచ్ కు 889 గజాల స్థలాన్ని కొనుగోలు చేశామని, గాజువాక, చోడవరంలో కూడా స్థలం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు ఖాతాదారుల సంక్షేమకోసం అనేక పథకాల అమలు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో బ్యాంక్ డైరెక్టర్ ఆచార్ల రామకృష్ణారావు, జోనల్ మేనేజర్ మజ్జి సత్యనారాయణ, బ్యాంక్ మేనేజర్ జిఎల్‌వి ప్రకాష్ రావు, మేనేజర్ పి సింహాద్రి, సలహా కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో ఖాతాదారులు పాల్గొ న్నారు. అనంతరం బ్యాంకులో సీనియర్ సభ్యులు ఉల్లాకుల నీలకంటేశ్వర యాదవ్‌ను సత్కరించారు.

ఉపాధి హామీ పనులను పరిశీలించిన జెసి

విశాలాంధ్ర-జామి: మండలం లోని భీమసింగిలో జరుగుతున్న ఉపాధి హామీపనులను క్షేత్ర స్థాయిలో పరిశీలనకు జాయింట్ కలెక్టర్ ఇజిఎస్.శివ ప్రసాద్ గురువారం విచ్చేసారు. గ్రామ పంచాయితీ పరిదిలో పర్యటించిన ఆయనకు ముందుగా మామిడి మొక్కలకు వేసిన ట్రెంచ్‌లు, ఫారం ఫాండ్‌లును అధికారులు చూపించారు. ఈసందర్భంగా ఆయా మామిడి తోటల రైతులతో జెసి నేరుగా మాట్లాడారు. ఉపాధి హామీలో చేసిన పనుల వలన కలిగే లాభాలను అడిగి తెలుసుకున్నారు. నీటిని నిల్వ చేసేందుకు, భూగర్భ జలాలను పెంచేందుకు, మొక్కలు పెంచుటకు, చుట్టుపక్కల బోర్ల రీచార్జ్‌కు, అలాగే అధిక పంట దిగుబడు లకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని రైతులు వివరించారు. దీనిపై సంతోషం వ్యక్తం చేసిన జెసి మండలంలోని మిగిలిన గ్రామాలలో సైతం ఇటువంటి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈపరిశీలనలో జెసితో పాటు ఎస్‌కోట ఎపిడి ఎస్.శారదాదేవి, డుమా టెక్నికల్ పర్సన్ కె.యుగేష్, జామి ఎపివో ఎం.కిరణ్మయి, ఇసిఎం, వినోద్, సిసిలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఇసుక ,కంకర అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

రెవెన్యూ, ఎస్ఈబి అధికారుల హెచ్చరిక

విశాలాంధ్ర-బొబ్బిలి: మండలం పట్టణ పరిధిలో అనుమతులు లేకుండా ఇసుక కంకర అక్రమ రవాణాకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఎస్ఐ తిరుమల రావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి హెచ్చరించారు.గురువారం మండల పరిధిలోని అలజంగి గ్రామంలో ట్రాక్టర్ ఓనర్స్ డ్రైవర్లతో పాత సచివాలయ భవనంలో ఇసుక అక్రమ రవాణాపై అవగాహన సదస్సు నిర్వహించారు .ఇసుక రవాణాకు ఎవ్వరికీ ఎటువంటి అనుమతులు లేవని అక్రమరవాణా చేస్తే ప్రభుత్వ నిబంధనలు పాటించి రెవిన్యూ, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులకు సహకరించాలని కోరారు. అలాగే ఎవరైనా అక్రమంగా ఇసుకను తరించినట్లైనా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నిరుపేదలకు ఆహార పొట్లాల పంపిణీ

విశాలాంధ్ర-జామి: మండల కేంద్ర మైన జామిలో గురువారం స్థానిక వాకర్స్ అసోషియేషన్ సభ్యులు నిరుపేదలకు ఆహార పొట్లాలను పంపిణీ చేసారు. ఉదయం స్థానిక ఎల్లారమ్మ ఆలయం వద్ద, సాయిబాబా కోవెల, షిర్డి సాయి ఆలయం, శివాలయం తదితర ప్రాంతాలలో ఉన్న యాచకులకు, ఇతర నిరుపేదలను గుర్తించి వారికి సభ్యులు ఆహార పొట్లాలను, మంచినీటి పొట్లాలను అందజేసారు. గతకొంత కాలంగా వాకర్స్ అసోషియేషన్ గ్రామంలో సేవా కార్యక్రమాలను చురుగ్గా చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సైన్సు పై అవగాహన, డ్రాయింగ్ పోటీలు

విశాలాంధ్ర-తెర్లాం: తెర్లాం శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిభిరంలో భాగంగా సైన్సు సబ్జక్టు పై అవగాహన కల్పించడం సైన్సు సంబంధించిన డ్రాయింగ్ పోటీలు నిర్వహణ గురుంచి ఈ కార్యక్రమానికి అతిథిగా వచ్చిన స్థానిక హైస్కూల్ హెచ్.ఎం ఎస్ఎస్ఎం రమేష్ సైన్సు ఏ విధంగా చదవాలి ప్రతి రోజు కనీసం ఒక్క గంట టైం అయిన సైన్సు సబ్జెక్టు కేటాయించాలని అన్నారు. హైస్కూల్ టీచర్ కే. విస్సు విద్యార్థులకు చిత్రలేఖనం పై ప్రతి విద్యార్థి, బొమ్మలు గీయడం ఇదివరకు నేర్పించడం జరిగింది. మరియు ఈ రోజు కూడా అందరికీ చిత్ర లేఖనం పై అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమానికి 26 మంది విద్యార్థులు పాల్గొన్నారు అని స్థానిక గ్రంథాలయ అధికారి సి.హెచ్ కృష్ణ మూర్తి తెలిపారు.

అనంతయ్య పార్థివదేహంపై టీడీపీ జెండా ఉంచిన కుటుంబ సభ్యులు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : మండలంలోని టీడీపీ సీనియర్ నాయకులు ఎనమదల అనంతయ్య చివరి కోరికను ఆయన కుటుంబ సభ్యులు నెరవేర్చారు. అనంతయ్య కోరిక మేరకు ఆయన పార్థివ దేహంపై టీడీపీ జెండాను కుటుంబ సభ్యులు ఉంచారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయ సాధనలో భాగంగా అనంతయ్య తెలుగుదేశం పార్టీలో పని చేశారని, తాను చనిపోయాక పార్టీ జెండా తనపై ఉంచాలని కోరేవారని.. అందుకే ఆయన పార్థివ దేహంపై పార్టీ కండువాను, జెండాను ఉంచామని తెలిపారు. కాగా అనంతయ్య పార్థివ దేహాన్ని మాజీ ఎమ్మెల్యేలు కోళ్ల లలిత కుమారి, శోభ హైమావతి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, జీసీసీ చైర్ పర్సన్ శోభ స్వాతిరాణి, టిడిపి నాయకులు ఇందుకూరి సుధారాజు, రాయవరపు చంద్రశేఖర్, రెడ్డి వెంకన్న, జిఎస్ నాయుడు, ఇందుకూరి శ్రీనివాసరాజు, కృష్ణ మహంతిపురం పిఏసిఎస్ అధ్యక్షుడు ఇందుకూరి రామరాజు, వందల సంఖ్యలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతయ్య అంతిమయాత్రలో అధిక సంఖ్యలో

ప్రత్యేక అవసరాలు గల 217 మంది పిల్లల్ని గుర్తింపు

జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్ కుమార్

విశాలాంధ్ర-వంగర: జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలను 217 మందిని గుర్తించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్ కుమార్ తెలిపారు. గురువారం ఈ ప్రత్యేక కార్యక్రమంలో పిల్లల గుర్తింపు చేసిన వారిని ఆయన పరిశీలించారు. మనస్సులో, ప్రత్యేక అవసరాలు సాధారణంగా చాలా తక్కువ అంచనాలతో గుర్తించబడతాయి. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను చదివించడం విలువను తల్లిదండ్రులు విశ్వసించాలి. ఎక్కువ అంచనాలు ఉంటే, కుటుంబంలో వారి ఆమోదం అంత ఎక్కువగా ఉంటుంది. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలందరినీ తప్పనిసరిగా ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలి. పాఠశాలల్లో వైద్యుడు, మనస్తత్వవేత్త, ప్రత్యేక విద్యావేత్త బృందం వారి వైకల్యాలను అంచనా వేసిన తరువాత, పిల్లవాడు తగిన విద్యా సెట్టింగులలో ఉంచబడతాడు. ఏ రకమైన తేలికపాటి మరియు మధ్యస్థ వైకల్యాలు ఉన్న పిల్లలను సాధారణ పాఠశాలల్లో చేర్చవచ్చున్నారు. ఈ ప్రత్యేక పాఠశాలలు/రెమిడియల్ పాఠశాలల్లో తీవ్రమైనవారు, సాధారణ పాఠశాలల ప్రయోజనాలను పొందడంలో సమస్యలు ఉన్న డ్రాప్ అవుట్‌లు ఓపెన్ పాఠశాలల్లో చేరవచ్చు. అభ్యాస వైకల్యం ఉన్న పిల్లలందరూ మొదట సాధారణ పాఠశాలల్లోనే నిర్వహించబడతారు. ఓపెన్ మరియు ప్రత్యేక పాఠశాలలు వైకల్యాలున్న పిల్లలకు కూడా వృత్తి విద్యా కోర్సులను అందిస్తాయి. అధికారిక పాఠశాలలు - మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ (సెకండరీ హయ్యర్ ఎడ్యుకేషన్ విభాగం) 1982 నుండి అధికారిక పాఠశాలల్లో 'వికలాంగ పిల్లల సమగ్ర విద్య' (%×జుణజ%) పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం ప్రధాన లక్ష్యం విద్యను అందించడం. వికలాంగ పిల్లలకు సాధారణ పాఠశాలల్లో అవకాశాలు, తద్వారా పాఠశాల వ్యవస్థలో వారి నిలుపుదల సులభతరం చేయడం. ప్రత్యేక పాఠశాలల్లో ఉంచబడిన వికలాంగ పిల్లలు ఒక క్రియాత్మక స్థాయిలో కమ్యూనికేషన్ మరియు రోజువారీ జీవన నైపుణ్యాలను పొందిన తర్వాత సాధారణ పాఠశాలల్లోకి చేర్చడం కోసం పరిగణించాలి. కింది రకాల వైకల్యాలున్న పిల్లలను సాధారణ పాఠశాల వ్యవస్థలో తప్పనిసరిగా ఏకీకృతం చేయాలి-అధికారిక అనధికారిక పాఠశాలల్లో లోకోమోటర్ హ్యాండిక్యాప్‌లు (ఓహెచ్) ఉన్న పిల్లలు స్వల్పంగా మధ్యస్తంగా వినికిడి లోపం ఉన్నవారు, పాక్షికంగా దృష్టిగల పిల్లలు, మానసిక వికలాంగుల విద్యావంతుల సమూహం (ఐక్యూ 50-70) బహుళ వైకల్యాలున్న పిల్లలు (అంధులు మరియు ఆర్థోపెడిక్, వినికిడి లోపం ఉన్నవారు మరియు ఆర్థోపెడిక్, విద్యావంతులైన మెంటల్లీ రిటార్డెడ్ మరియు ఎముకలు దృష్టి లోపం మరియు తేలికపాటి వినికిడి లోపం) ఒక వైద్యుడు, మనస్తత్వవేత్త మరియు ప్రత్యేక అధ్యాపకులతో కూడిన ముగ్గురు సభ్యుల అంచనా బృందం ఏర్పాటు చేయబడిందన్నారు. వారి అంచనా నివేదిక పిల్లలను నేరుగా సాధారణ పాఠశాలలో చేర్చవచ్చా లేదా ప్రత్యేక పాఠశాలలో ప్రిపరేషన్ పొందాలా అని సిఫార్సు చేస్తుంది. / లేదా ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్ సెంటర్ (ఈసీసీఈ)లో ప్రత్యేక ప్రిపరేటరీ క్లాస్ ఈ ప్రయోజనం కోసం ప్రత్యేకంగా అమర్చబడిందన్నారు. మండలంలో ఇంతవరకూ ప్రత్యేక అవసరాలగల పిల్లలను 8 మందినిగుర్తించినట్లు వంగర మండల విద్యాశాఖఅధికారి వై.దుర్గారావు తెలిపారు. సంగాం, శ్రీహరిపురం,శివ్వాం గ్రామాల్లోఇద్దరేసి వంతున, తలగాం, అరసాడ గ్రామాల్లో ఒక్కొక్కరిని గుర్తించినట్లు ఆయన చెప్పారు.ప్రత్యేక అవసరాలు గల పిల్లలు గుర్తింపు కార్యక్రమంలో ఇంటింటి సర్వే చేసి గుర్తిస్తున్నట్లు ఆయన చెప్పారు.ఈరోజు ఉదయం అరసాడ గ్రామంలో డోర్ టు డోర్ సర్వే కార్యక్రమంలో పాల్గొని డి .హేమలత,మానసిక వైకల్యం విద్యార్థిని గుర్తించి జడ్పీహెచ్ఎస్ అరసాడ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించడం జరిగిందన్నారు.వివిధ వైకల్యంతో ఉన్న బాలబాలికలను 0 నుండి 18 సంవత్సరాల వయసుగల విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించి బాధ్యత పిల్లల తల్లిదండ్రులు పై ఉందని మండల విద్యాశాఖ అధికారి వివరించారు. ప్రత్యేక అవసరాలు పిల్లలు పాఠశాలలో చేర్పించడం వల్ల ఫిజియోథెరపీ, స్పీచ్ తెరపి ఉపకరణాలు, విద్యా బోధన. విద్యా బోధన. గృహ ధారణ విద్యా ప్రభుత్వం నుండి రానున్న వివిధ రకాల పథకాలకు అర్హులవుతారని ఎంఈఓ దుర్గారావు పిల్లలు తల్లిదండ్రులకు వివరించారు.. ప్రభుత్వం దివ్యాంగులకు ఎన్నో సంక్షేమ పథకాలుఅమలు చేస్తుందని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని తెలియపరిచారు.ప్రతి దివ్యాంగ విద్యార్థి కూడా పాఠశాలలో చేర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక అవసరాల ఉపాధ్యాయులు వై సంగోజి నాయుడు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలను వినియోగించుకోండి

ఎంఇవో-2 గంగరాజు వినతి

విశాలాంధ్ర-జామి: ఎన్నో ఏళ్ళగా మండల ప్రజలు, విద్యార్థులు ఎదురు చూస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలను స్థానిక జెడ్పి ఉన్నత పాఠశాలలో ఫ్లసటూగా ఏర్పాటు చేసిందని, ఈకళాశాలను విద్యార్థులు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని మండల విద్యాశాఖాధికారి-2 కె. గంగరాజు విన్నవించారు. మండలంలో ప్రభుత్వ పరంగా జూనియర్ కళాశాల కావాలని పోరాడుతున్నారని, చివరకు ప్రభుత్వం ఈఏడాదినుంచి కళాశాల విద్యను ప్రారంభిం చిందని తెలిపారు. ఈఏడాదినుంచి అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. ఈఏడాది ఎంపిసి, సిఇసి గ్రూపులను ఏర్పాటు చేసారని, ఇందుకు సంభందించి ప్రభుత్వ పరంగా ఉత్తర్వులు అందాయన్నారు. జూన్ 1నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, విద్యార్థులును వారి తల్లిదండ్రులు స్థానికంగా అందుబాటులో ఉండే ఈకళాశాలలో జాయిన్ చేయాలని సూచించారు. అలాగే పలువురు రిటైర్డ్ ఉపాధ్యాయులు జామిలో కళాశాలకోసం ఎన్నో ప్రయత్నాలు చేసారని, చివరకు మంజూరైన ఈకళాశాలను ఆదరించేలా చూడాలని కోరారు. కొత్తగా నిర్మించిన తరగతి గదులతోపాటు, అధ్యాపక సిబ్బంది, అన్ని రకాల సౌకర్యాలు ఇక్కడ ఉన్నాయన్నారు.

సీడ్ బాల్స్ చేసి విత్తుకుంటే బహు ప్రయోజనం

ప్రకృతి వ్యవసాయం ఆర్టీఎల్ ప్రకాష్

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని రైతులు సీడ్ బాల్స్ చేసి విత్తనాలను వెసుకుంటే మంచి ప్రయోజనం ఉంటుందని అలాగే పంటలలో అధిక దిగుబడిని పొందవచ్చునని రీజనల్ అధికారులైన ఆర్టీవో హేమ సుందర్,ఆర్టిఎల్ ప్రకాసులు రైతులకు తెలియజేశారు.అలాగే మండలం లోని వీలుపర్తి క్లస్టర్ పరిధిలో గల చినగుడిపాల గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను గురువారం వారు సందర్శించారు.ఈ సందర్శనలో భాగంగా బోజంకి వానిపాలెంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి ఖరీఫ్ కాలంలో వరి విత్తనాలను సీడ్ బాల్స్ చేసి విత్తుకోవడం వల్ల వర్షాలు లేటుగా కురిసిన,వర్షం ఎప్పుడు పడితే అప్పుడు సీడ్‌బాల్స్ లోని విత్తనం మొలక రావడానికి అనుకూలంగా ఉంటుందని రైతులకు వివరించారుఈ పద్ధతిని ప్రకృతి వ్యవసాయంలో పనిచేస్తున్న ప్రతి క్యాడర్ ముందుగా చేసి రైతులకు చూపించాలన్నారు.కొంతమంది రైతులకు వరి ముందు నవధాన్య విత్తనాల కిట్లను అందజేయడం జరిగిం దన్నారు. నువ్వులలో తెల్లజొన్న, గోంగూర, బీర, బెండ, చిక్కుడు, బొబ్బర వంటి అంతర పంటలను పండించడం వలన అధిక రాబడితో పాటు పంటలలో జీవన వైవిధ్యం జరుగుతుందని తద్వారా నేలకు పోషకాలు పెరుగుతాయి అన్నారు.తద్వారా దేశవాళీ రకాల విత్తనాలను సీడ్ బాల్ చేయించి వాటిని పొలంలో విత్తనం జరిగిందన్నారు. ప్రతి రైతు వరికి ముందు నవ ధాన్యాలను వేసుకోవడం వల్ల భూమిలో పోషకాలతో పాట సూక్ష్మ జీవులు పెరుగుతాయని ప్రధాన పంటకు మంచి పోషకాలు అందుతాయని, అలాగే కలుపు నివారణ జరుగుతుందన్నారు. అలాగే ఏ.పీ.సీ.ఎస్.ఎఫ్ క్యాడర్ మాట్లాడుతూ ప్రతి రైతు నవధాన్యాలను పండించడానికి కృషి చేసి నవధాన్యాలను పండించేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ వరప్రసాద్, ఎం పి ఎల్ వసంత,ఎమ్.టి సన్యాసమ్మలతో పాటు మండల ఇన్చార్జీలు,ఐ.సి.ఆర్.పి లు రైతులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అన్నమాచార్య 616వ జయంతి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ విజయనగరం 677వ కార్యక్రమం మరియు రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ సంయుక్త నిర్వహణలో కొత్తగ్రహారం రోటరీ కమ్యూనిటీ హాల్ నందు గురువారం సాయంత్రం నిర్వహించిన అన్నమయ్య 616వ జయంతి అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. రోటరీ ద్వారం నరసింగరావు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ సొసైటీ ప్రెసిడెంట్ ఉసిరికల చంద్రశేఖర్ రావు, ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ధవళ సర్వేశ్వర రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సప్తగిరి సంకీర్తనల గోష్టిగానం జరిగింది. స్థానిక విద్వాంసులు, విద్యార్థులు, వివిధ సంగీత సంస్థల ప్రతినిధులు ఈ గోష్టిగానంలో పాల్గొన్నారు. ఇటీవల అంతర్జాలంలో నిర్వహించిన అన్నమయ్య కీర్తనల పోటీ విజేతలను ప్రకటించి, అందులో స్థానికంగా గెలుపొందిన వారికి బహుమతులు మ్యూజిక్ అకాడమీ గౌరవాధ్యక్షులు డాక్టర్ డి.వి.శ్రీకాంత్, మహారాజ కళాశాల విశ్రాంత అధ్యక్షులు డాక్టర్ అయ్యగారి రాఘవరావు, అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి అందజేశారు. అలాగే న్యాయనిర్ణేతలను సత్కరించారు. కార్యక్రమ ప్రాయోజకులు డాక్టర్ రాఘవరావు అన్నమయ్య గురించి విశ్లేషించి ప్రసంగించారు. ఇందులో ప్రముఖ వీణ విద్వాంసురాలు స్వరాజ్యలక్ష్మి వీణపై కీర్తనలను వాయించారు. అలాగే ఇటీవల మృదంగంలో టాప్ గ్రేడ్ సాధించిన సంస్థ కార్యదర్శి మరియు అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవిని అన్నమయ్య భక్తులు కళాకారులు ఘనంగా సత్కరించారు. డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ అకాడమీ లో అన్నమయ్య అలాగే భక్తి సంగీతానికి ఒక ప్రత్యేక విభాగం ఉందని, అందరూ నేర్చుకోవడం వల్ల మానసికంగా చాలా ఆరోగ్యంగా ఉంటారని తెలియజేశారు.

తర్వాత అందరూ విడివిడిగా లఘు సంకీర్తనా కచేరీలు చేశారు.

ప్రఖ్యాత విద్వాంసులు, డాక్టర్ కె.ఎ.పద్మప్రియ, రాధాకుమారి, ఖండవల్లి సరస్వతి, హారిక శివరాం, పద్మావతీ శారద, డాక్టర్ కృష్ణ శాంతి, టి.మహేశ్వర రావు, మెహెర్లత, సుభద్ర, శిరీష తదితరులు గానం చేయగా వయోలిన్ పై ఈశ్వరమ్మ,వేణువు పై శ్రీ మోడెకుర్తి కామేశ్వర రావు, మృదంగంపై డాక్టర్ మండపాక రవి, మహేశ్వర రావు సహకరించారు. కోశాధికారి, ధన్వాడ సుధాకర్, గ్రంథి విష్ణుమూర్తి, సుబ్బారావు, మంగతాయారు, కాండూరి గోపీకృష్ణ, బాపూజీ, అకాడమీ సభ్యులు, అధ్యాపకులు, రొటీరియన్లు, సంగీతాభిమానులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్ర పాఠశాలల్లో ఒకే సిలబస్ ను అమలు చేయాలి

ఏపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జెసి రాజు



విశాలాంధ్ర-బొబ్బిలి: రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో వచ్చే విద్యాసంవత్సరం నుండి విద్యార్థులకు ఒకే విధమైన సిలబస్ ను ప్రవేశ పెట్టాలని ఏ పి టి ఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జె సి రాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎన్ జి ఓ హోమ్‌లో ఫెడరేషన్ డివిజన్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని మండల శాఖ అధ్యక్షులు సి హెచ్ .జె ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఏ పి టి ఎఫ్ రాష్ట్ర నాయకులు జె సి రాజు మాట్లాడుతూ 6,7 తరగతులకు గణితం, సామాన్య శాస్త్రం, ఇంగ్లీష్ సి బీఎస్ ఈ సిలబస్ కాగా మిగతావి రాష్ట్ర సిలబస్ అని అలాగే ,8,9,10 తరగతుల విద్యార్థులు అన్ని సబ్జెక్ట్స్ ను ఒకే సి బిఎస్ఈ సిలబస్ లోనే చదువుతారని కానీ పరీక్షలు వేరువేరుగా రాయాల్సి రావటంతో విద్యార్థులు, తల్లితం డ్రులుతీవ్ర గందర గోళానికి గురవుతున్నారన్నారు. ఒకే సిలబస్ చదివిన విద్యార్థులు కొందరు సిబిఎస్ ఈ పరీక్షలు రాస్తే మరికొందరు రాష్ట్ర పరీక్షల నిర్వహణ విభాగం నిర్వహించే పరీక్షలు రాస్తారని, ప్రశ్నపత్రాల స్థాయి, విద్యార్థుల సామర్థ్యాల పరిశీలనలో వ్యత్యాసం వుంటున్నదని ఇది సరైన పద్ధతి కాదనిఅన్నారు. ఒకే సిలబస్,ఒకే పరీక్షలు విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని, విద్యార్థులందరికి సమన్యాయం ,సమాన అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే 117వ జిఓ ను రద్దు చేసి ప్రాథమిక విద్య బలోపేతం అయ్యేలా ఒకటి నుండి ఐదో తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలను ఒకే చోట పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి పద్మ మాట్లాడుతూ ప్రాథమిక విద్య ,విద్యార్థి ఇష్టాన్ని బట్టి మాధ్యమాన్ని ఎంచుకొనేలా తెలుగు, ఆంగ్ల మాధ్యమాలువిద్యార్థికి అందుబాటులో ఉంచి వాటిని కొనసాగించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగాఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేయాలని ఆమె డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు బంకురు జోగినాయుడు సిపి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య, లక్ష్మణరావు, రామకృష్ణ, పరిసినాయుడు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేటలో శ్రీదారగంగమ్మ అమ్మవారి ఘటాలు

అడుగడుగునా అమ్మవారి కాళ్ళు కడిగిన భక్తులు



విశాలాంధ్ర-శృంగవరపు కోట : ఎస్.కోట పట్టణ శివారు సీతంపేటలో గ్రామదేవత శ్రీదార గంగమ్మ అమ్మవారి ఘటాలు గురు వారం మధ్యాహ్నం తిరిగాయి. భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఘటాలు మోస్తున్న పూజారమ్మ కాళ్ళు కడిగేందుకు పోటీ పడ్డారు. భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పించారు. సీతంపేట యువకులు అమ్మవారి ఘటాలు గ్రామంలో ప్రశాంతంగా తిరిగి వెళ్లేలా సహకరించారు. ఇదిలావుండగా ఈనెల 26న అమ్మవారి నిజరూప దర్శనం, 27న తొలేళ్ళు, 28న అనుపోత్సవ కార్యక్రమం ఉంటుందని అనువంశిక పూజారి మోపాద గౌరినాయుడు వెల్లడించారు.

బాగా చదువుకుని తల్లిదండ్రులకు పేరు తేవాలి

లైబ్రేరియన్ దామోదర శ్రీధర్

విశాలాంధ్ర-శృంగవరపు కోట : బాగా చదువుకుని తల్లిదండ్రులకు పేరు తేవాలని విద్యార్థులకు లైబ్రేరియన్ దామోదర శ్రీధర్ పిలుపునిచ్చారు. శృంగవరపు కోట శాఖా గ్రంథాలయంలో "వేసవి విజ్ఞాన శిబిరం"లో భాగంగా గురువారం విద్యార్థులచే నీతి కథలు చదివించడం, కథలోని నీతిని బోధించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే చదువుకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, చదువుతో పాటు మీకిష్టమైన క్రీడల్లో సాధన చేయాలని సూచించారు. విద్యతోనే మీ కుటుంబాల పేదరికం దూరమవుతుందని హితవుచెప్పారు. అనంతరం విద్యార్థుల మధ్య క్యారం బోర్డ్, చదరంగం, ఇతర ఆటలను ఆడించారు. కార్యక్రమంలో మొత్తం 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

షిర్డీ సాయికి క్షీరాభిషేకం

విశాలాంధ్ర-విజయ నగరం టౌన్: పట్టణంలో ధర్మపురి రోడ్డు వద్ద ఉన్న అవధూత దత్త సాయి సమర్థపీఠంలో ఉన్న షిరిడి సాయిబాబా ఉత్సవ విగ్రహానికి గురువారం ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు పాలాభిషేకం నిర్వహించారు అనంతరం ఉత్సవ, మూలవిరాట్ విగ్రహాలకు విశేష అలంకరణ సాయి సుందర మహారాజ్ ఆధ్వర్యంలో రామకృష్ణ శర్మచే నిర్వహించారు ఈ సందర్భంగా సాయి సుందర మహారాజ్ మాట్లాడుతూ అవధూత దత్త సాయి సమర్థ పీఠంలో ఉన్న ఉత్సవ విగ్రహానికి ప్రతి గురువారం కీరాభిషేకం ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉత్తరాంధ్రకు మొట్టమొదటి దేవాలయంగా ఎంతో ఘన చరిత్ర ఉందన్నారు . ప్రతి గురువారం సాయంత్రం భజన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. వీటితోపాటు మూలవిరాట్ విగ్రహానికి శ్రీరామనవమి, దసరా,గురుపౌర్ణమి పర్వదినాలలో భక్తులచే పాలాభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఆదివారం దేవాలయంలో ఉన్న సిద్ధి రాజ దత్తాత్రేయ స్వామికి తైలాభిషేకం భక్తుల గోత్రనామాలతో నిర్వహిస్తున్నామన్నారు.

మస్తర్లు తనిఖీ చేసిన ఎంపీడీవో



విశాలాంధ్ర-రాజాం: ఈ రోజు రాజాం మండల పరిధిలోని కంచరాం గ్రామం లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం చెరువు పని ప్రదేశములో మస్తర్లను తనిఖీ చేశారు. అందరూ వేతన దారులు సమయ పాలన పాటించాలని, కొలతలు ప్రకారం పని చేసి రోజు వారి వేతనం 300 పొందాలని ఎంపిడివో వావులపల్లి శ్రీనివాసరావు వేతన దారులకు సూచించారు.

ఆటో-బైక్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-వంగర :మండలంలో లక్ష్మింపేట నుండిశివ్వాం గ్రామం వెళుండగా, శివ్వాం, ఎం.సీతారాంపురం గ్రామాల మధ్యలో రోడ్డు పై ఆటో,మోటార్ సైకిల్ ఢీ కొన్నాయి.ఢీ కొనగా మోటార్ సైకిల్ మీద నున్నటువంటి కో దూరు సత్యం నాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనతలపై,మోకాలు పైబలమైన గాయాలయ్యాయి. తలపై, కుడి కాలు ఇరిగి పొగా, తల మీద ను పెద్ద గాయాలు కావటంతో విపరీతమైన రక్తంకారడంతో వ్యక్తిని వెంటనే రాజాం కేర్ హాస్పటల్ కు తరలించినట్లు ఎస్ఐ జనార్ధనరావు తెలిపారు.లక్ష్మింపేట నుండి శివ్వాంలో తమ బంధువులు సంబరాలు కు చెప్పగా, గురువారం బయలు దేరి వెళ్తుండగా మార్గమధ్యలో ఈ యాక్సిడెంట్ జరిగినట్లుపోలీసులు వెల్లడించారు. ఈ యాక్సిడెంట్లో బలమైన గాయాలు అయ్యాయి. అంతేకాక మోటార్ సైకిల్ డ్రైవింగ్ చేసిన సత్యంనాయుడు మనవుడు అజిత్‌కుమార్ కు చిన్న, చిన్నగాయాలైనట్లు ఆయనచెప్పారు. బండిని ఢీకొట్టినఆటో డ్రైవర్ వెంటనే ఫరారైనట్లు పోలీసులు చెప్పారు. దీనిపై కేసు నమోదుచేసిఆటో డ్రైవర్ కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.